"'నాథా' సృష్టిలోకెల్లా అత్యంత సహనం కలిగిన జాతి మనదేనంటారు నిజమేనా?" పేపర్లు పరపర నములుతూ ప్రశ్నించింది ఆడగాడిద, తన పతిదేవుడిని.

# శంకరం అనే ఆర్.ఎస్.కథ

జి. ఆర్. మహర్షి

"ఛీఛీ' నాన్సెన్స్! ఏమిటా గ్రాంథికం? ఆ తెలుగు డిపార్ట్‌మెంట్‌వద్ద పడ్డ పేపర్లు తినొద్దని ఎన్నిసార్లు చెప్పాలినీకు? నాతో ఇంగ్లీష్‌పేపర్లు తిను, నాలుగు ముక్కలు ఇంగ్లీషైనా వంటబడుతుంది" కసురుకుంది మగగాడిద.

"ముందు నా ప్రశ్నకు సమాధానం చెప్తారా? లేదు వెక్కిరిస్తుంటారా?" అంటూ వెనుకకాళ్ళను ఎటెన్షన్‌లోకి తెచ్చింది ఆడ గాడిద.

దాంతో మగ గాడిద జడుసుకొని, భార్యవద్దకు వచ్చి ఆప్యాయంగా చెవి కొరికి "పిచ్చిదానా, ఇన్నాళ్ళుగా యూనివర్శిటీ క్యాంపస్‌లో కాపురముంటున్నావ్! ఇంకా నీ మైండ్‌లో ఇలాంటి ప్రశ్నలు పుట్టడమేంటి? ఛీఛీ కాకపోతేసరి!" అంది.

"విషయం చెప్పండి"

"మనకంటే ఎక్కువ ఓపిక, సహనం వున్న నలుపు గాడిదల జాతి వేరే వుంది. వారినే రిసెర్చ్ స్కాలర్లు అంటారు."

"ఎవరా రిసెర్చ్ స్కాలర్లు? ఏమా కథ?"

"కొశ్చెన్లు వేయకుండా విను, నీకు శంకరం అనే ఒక ఆర్.ఎస్.కథ చెపుతా"

"చెప్పండి నాథా" అంటూ చెవులు టపటప లాడించి ఆనందంగా ఓండ్రపెట్టింది ఆడ గాడిద.

** ** **

అనగా అనగా అని మనం ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెడితే శంకరం అనే యువకుడు కనిపిస్తాడు, అతన్ని మంచి వాడని, బుద్ధిమంతుడని, భయస్తుడని ఇలా రకరకాల దుష్టనామాలతో స్నేహితులు పిలిచేవారు!

శంకరం నోట్లో వేలుపెట్టినా కొరకలేడని ప్రతీతి, ఈ విషయాన్ని కొందరు ప్రాక్టికల్‌గా రుజువు చేస్తూ సురక్షితమైన తమ వేళ్ళను పదిమంది ఎదుట ప్రదర్శించారు కూడాను.

అతను అస్తమానం పుస్తకాలను చక్కిలాల్లా కరకరా నమిలేవాడు. ఎప్పుడూ కుతకుత వుడుకుతూ, అతలా కుతలమయ్యే యూనివర్శిటీ రాజకీయాల గురించి అక్షరమ్ముక్క తెలుసుకోకుండా అతను రెండేళ్ళ ఎం.ఏ. కోర్సు (ఇంగ్లీష్) పాసయ్యాడు. సబ్జెక్టుని సంతృప్తిగా తిన్నందుకే అతనికి ఫస్ట్‌క్లాస్ వచ్చింది.

ఎం.ఏ.గట్టెక్కిన తర్వాత ఒకానొక దుర్ముహూర్తంలో రిసెర్చి చేయాలని కోర్కె పుట్టింది శంకరానికి.

సరాసరి తన సీనియర్ వద్దకెళ్ళి సలహా అడిగాడు.

సీనియర్ పకపకా నవ్వి, బుస్‌మని నిట్టూర్చి, శూన్యంలోకి నిర్లిప్తంగా చూస్తూ! 'స్లేవరీ' అంటూ గొణుక్కుని "ఎంతకాలం బానిసగా వుండాలనుకుంటున్నావ్? ఏడాదా? లేక మూడేళ్ళా?" అని ప్రశ్నించాడు.

శంకరం వైట్ మొహంతో "అంటే?" అని ప్రశ్నాకొక్కాన్ని వదిలాడు.

"ఆహా! మరేంలేదు. ఎం.ఫిల్. చేయాలంటే ఒక సంవత్సరం పాటు గైడ్‌కి అరవచాకిరి చేయాలి. అదే పి.హెచ్.డి. అయితే మూడేళ్ళకు పైగా వెట్టిచాకిరి! దేన్ని ఎంచుకుంటావో నీ ఇష్టం" అయినా ఈ ప్రాథమిక సూత్రాల పరిజ్ఞానం లేకుండా నువ్వు ఎం.ఏ. ఎలా చదివావు తిక్కశంకరయ్యా" అన్నాడు సీనియర్ జాలీగా.

తిక్కశంకరయ్య వెర్రిమొహమేసి "అంతేనంటారా?" అని బేలగా అడిగాడు.

"ఉన్న విషయమంతే, అందరు గైడులు ఆర్.ఎస్.ల పాలిట యముళ్ళలాగా, వుండి చెండుకు తింటారు. కాకపోతే గంజాయివనంలో తులసిమొక్కల్లాగా కొందరు మహానుభావులు కొండొకచో వుండవచ్చు. గైడ్లబాధలు పడలేక ఆత్మహత్యలు చేసుకున్న ఆర్.ఎస్.ల కథలు వినలేదా?" అంటూ రిసెర్చ్‌ప్రవిషత్ గురించి బోధించాడు సీనియర్.

శంకరం డీలాపడిపోయాడు.

కానీ రిసెర్చ్ మీదున్న తమకాన్ని చంపుకోలేక ఎం.ఫిల్.కి అప్లికేషన్ పడేశాడు.

సీటొచ్చింది. ఫీజు కట్టి చేరిపోయాడు.




ప్రొఫెసర్ విశ్వామిత్రను శంకరానికి గైడ్‌గా వేశారు.

విశ్వామిత్ర గురించి శంకరానికి కాస్త తెలుసు.

తాను పట్టిన కుందేలుకి కాళ్ళేలేవనేరకం విశ్వామిత్ర.

'రోమియో అండ్ జూలియట్'ని ఆర్.కె. నారాయణ్ రాశాడని వాదించగలదిట్ట ఆయన. సాధారణంగా వాదనల్లో విశ్వామిత్రే గెలుస్తుంటాడు.

ఎందుకంటే వాగ్వివాదంలో ఆయన అరిచేఅరుపులకు, చూపే హావభావాలకు, అవతలి వ్యక్తి వచ్చి నట్టు తోకముడిచి ఉడాయించాల్సిందే!

శంకరం విశ్వామిత్రవద్దకెళ్ళాడు.

గొంగళిపురుగుమీసాలు దువ్వుకుంటూ "ఎవర్నువ్వు?" అని గద్దించాడు విశ్వామిత్ర.

"నేను శం... శంకరాన్నిసార్, మీ స్టూడెంట్‌ని" అన్నాడు శంకరం వణికిపోతూ.

"అయితే ఏంటి?"

"ప్రస్తుతం నేను రిసెర్చ్ స్కాలర్ని, మీరు నాకు గైడ్"

"రిసెర్చ్ స్కాలర్‌వా, అయితే వెళ్ళి ఓ గ్లాసు మంచినీళ్ళు తీసుకురా" శంకరం మంచినీళ్ళు తెచ్చి ఇచ్చాడు.

"ఇప్పుడు నమ్ముతున్నా, నువ్వు రిసెర్చ్ స్కాలర్‌వేనని- సరే నీకు టైప్ చేయడం వస్తుందా?"

"వస్తుంది సార్, హయ్యర్ పాసయ్యాను. టైప్ మిషన్ రిపేరీకూడా..."

"ఇక ఆపు, ఈ కాలంలోవి అసలు టైప్ మిషన్లేనా? మా కాలంలోవే అసలైన టైప్ మిషన్లు. వాటిని మొయ్యాలంటే ఇద్దరు మనుషులు అవసరమయ్యేవారు. ఆ పద్ధతే వేరు, ఆ సౌండే వేరు" అంటూ గతంలోకి జారుకొని తన్మయత్వంతో కళ్ళు మూసుకున్నాడు.

ఓ మూడు నిముషాల తరువాత విశ్వామిత్ర గురక పెట్టసాగాడు.

శంకరం పిచ్చిమొహంతో నిలబడ్డాడు.

ఓ అరగంట తర్వాత విశ్వామిత్ర కళ్ళు తెరిచి అదృష్టవంతుడివి, తొందరగా మెలకు వచ్చింది. రోజూ మూడు గంటలపాటు రూంలో నిద్రపోవటం నా హాబీ, ఇంతకూ నీకు గోలీలాడ్డం వచ్చంటావు" అన్నాడు.

"సారీయ కాదుసార్, టైప్ వచ్చుంటాను"

వెంటనే విశ్వామిత్ర బీరువాలోంచి ఓ బండెడు కాయితాలు తీసి శంకరం ముందు పడేసి "ఇవన్నీ తప్పులు లేకుండా టైప్ చేసుకురా" అని ఆజ్ఞాపించాడు.

"మరి టైప్‌మిషన్..." నోణిగాడు శంకరం.

"మన డిపార్ట్‌మెంట్‌లో వుందిగా"

వారం రోజులు పట్టినేది టైప్ కార్యక్రమం ముగించాడు శంకరం. ఆ కాయితాలను మోసుకొని విశ్వామిత్రవద్ద కెళ్ళాడు.

"తప్పులేం లేవుగా?" అడిగాడు విశ్వామిత్ర.

"లేవుసార్" చెప్పాడు శంకరం.

"సరే, ఇక వెళ్ళు"

"సార్... మరి నా రీసెర్చ్ టాపిక్..."

"తొందరేముందోయ్, కాస్త ఓపికపట్టు. రీసెర్చ్ స్కాలర్‌కి బుర్రున్నా లేకపోయినా ప్రధానంగా ఓపి కుండాలి. మేమంతా రీసెర్చ్‌కోసం ఎంత కష్టపడ్డా మని రేపోసారి ఇంటికిరా. టాపిక్ గురించి డిస్కస్ చేద్దాం"

** ** **

మరుసటిరోజు విశ్వామిత్ర ఇంటికెళ్ళాడు శంకరం.

ఇంటిబయట ఒక యువకుడు స్కూటర్ తుడుస్తూ కనిపించాడు.

"మీ అయ్యగారున్నారా?" ప్రశ్నించాడతన్ని శంకరం.


"మీరు నన్ను పనివాడిగా భావిస్తున్నారా?" ఆనందంతో తబ్బిబ్బవుతూ అడిగాడా యువకుడు.

"అవును"

"కానీ కాదు. అదే నా బ్యాడ్‌లక్, పనివాడు ఎప్పుడుపడితే అప్పుడు పనివదిలేసి వెళ్ళిపోతాడు, నాకు ఆ ఛాన్స్ లేదు, నేను రీసెర్చ్ స్కాలర్ని"

"నేను కూడా రీసెర్చ్ స్కాలర్నే"

"అయితే ఈ టెక్కు ఎన్నాళ్ళులే, మూడు రోజులు కూరగాయల సంచులు మోసేసరికి దిగిపోతుంది, వెళతాను వెళ్ళి నీళ్ళు తోడాలి"




శంకరం ఇంట్లోకి అడుగు పెట్టాడు. విశ్వామిత్ర భార్య ఎదురొచ్చి "ఎవర్నాయనా?" అని అడిగింది.

"ఆర్.ఎస్. నండి" భయంభయంగా అన్నాడు శంకరం.

"ఆహా! ఇప్పటికి తీరిందా నాయనా! మిమ్మల్నని ఏం లాభం?

కట్టుకున్నోడికి వుండాలి బుద్ధి, ఆ కామర్స్ ప్రొఫెసర్ భార్య చూడండి, చేతికింద నలుగురు ఆర్.ఎస్.లను పెట్టుకొని ఎలా ఆడిస్తూవుందో అని లక్షసార్లు చెప్పాను. చెవికెక్కితేనా, క్యాంపస్‌లో తల కొట్టేసినట్టుందమ్మా"

విశ్వామిత్ర కుర్చీలో కూచొని ఇదేం పట్టనట్టు పేపర్ చదువుకుంటున్నాడు.

"సారీ, నా టాపిక్" మెల్లగా అడిగాడు శంకరం

పోచికోలు కబుర్లకిది సమయం కాదు నాయనా, వెళ్లి కూరగాయలు తీసుకురా, వంటకి వేళయ్యింది. ఇంతకూ కూరగాయలు బేరమాడ్డం వచ్చా" అడిగింది లేడీ విశ్వామిత్ర.

"రాదండి" తప్పుచేసినోడిలా చెప్పాడు శంకరం

"తెలుసుకో నాయనా, ఆర్.ఎస్.కి ముందు తెలియాల్సిన ముఖ్యమైన విషయమది" అంటూ హనుమంతుడి తోకంత లిస్ట్, ఒక నాలుగు సంచులు శంకరం మొహంపై పడేసింది.

శంకరం బజారు కెళ్ళి కొట్టువాడు చెప్పిన ధరకే కూరగాయలు కొన్నాడు. కాని విశ్వామిత్ర భార్య వద్ద ధరలు తగ్గించి చెప్పాడు. తన జేబుకి చిల్లుపెట్టి మిగిలిన మొత్తాన్ని జమచేశాడు.

ఆపసోపాలు పడుతూ వచ్చి శంకరం కూరగాయల సంచులు పడేసిన వెంటనే, విశ్వామిత్ర కూతురు వచ్చి తన వంటోడిని శంకరానికి తగిలించి వెళ్లిపోయింది.!

"వీడిని ఏం చేయాలండి?" అడిగాడు శంకరం కంగారుగా.

"ఏం చేయడమేంటి? కొంపదీసి అమ్ముకొస్తావా ఏమిటి? అలా షికారు తీసుకెళ్ళు, వంటోడి సరదా తీరుతుంది" ఆర్డర్ వేసింది విశ్వామిత్ర భార్య

"నేను రీసెర్చ్ స్కాలర్‌ని" అని తన ఉనికిని చాట బోయాడు శంకరం

ఇంతలో వంటోడు ఆరున్నొక్క రాగం ఆగెత్తుకొని, తన ముక్కులోని ద్రవపదార్థాన్ని సమూలంగా శంకరం చొక్కాకి రుద్ది ముచ్చటపడ్డాడు.

కాసేపటికి తన కాలకృత్యాలను కూడా శంకరం మీదే కానిచ్చి వాడు విశ్రమించాడు.

*** *** ***

రెండు నెలల కాలం మాయింగ్‌గంలా సాగింది శంకరానికి. హాస్టల్లో భోజనం చేయడం, వెళ్లి ప్రొఫెసర్ ఇంటి వద్ద డ్యూటీలో చేరడం ఇలా గడిచిపోయింది.

శంకరం డ్యూటీ ఇలా వుండేది. రోజూ కూరగాయలు తేవడం, గైడ్ ఇంటికి వచ్చిన బంధువులను రిసీవ్ చేసుకోవడం, టికెట్లు రిజర్వు చేయడం, వారిని స్టేషన్ వద్ద వదిలిరావడం, గైడ్ ఇంట్లోని పిల్లలను ఎత్తుకొని మోయడం.

అప్పుడప్పుడు వారికి గుర్రంగాను, ఏనుగుగాను వ్యవహరించడం

అప్పుడప్పుడు "నా రీసెర్చి" అంటూ గొణిగే




వాడు.

విశ్వామిత్ర ఉగ్రంగా చూసి గుడ్లురిమి, శంకరాన్ని దారిలోకి తెచ్చేవాడు.

ఓ రోజు విశ్వామిత్ర, శంకరాన్ని పిలిచి

"నీ కిష్టమైన రచయిత పేరు చెప్పవోయ్" అన్నాడు

"తెలుగా, ఇంగ్లీషా?" సంబరంగా అడిగాడు శంకరం

"మన సబ్జెక్ట్ ఏంటి?"

"ఇంగ్లీష్"

"మరి, తెలుగువూసు ఎత్తావంటే తోలువలుస్తా"

"హెమింగ్వే"

"సరే! వెళ్ళి హెమింగ్వే రచనలపై ఒక ఆర్టికల్ రాసుకురా, నీ రిసెర్చికి ఇదే నాంది"

శంకరం హుషారుగా వెళ్ళి, లైబ్రరీని ఓ వారం రోజులు తొలిచి ఆర్టికల్ తయారుచేసి విశ్వామిత్ర వద్దకు వచ్చాడు.

విశ్వామిత్ర ఆ వ్యాసాన్ని వూరికే ఎగాదిగా చూసి "అమ్మాయ్ మన బుజ్జిగాడున్నాడా?" అని కూతుర్ని కేకేసాడు.

బుజ్జిగాడికి, హెమింగ్వేకి ఏం బాదరాయణ సంబంధమో శంకరానికి అర్థం కాలేదు.

"లేరు నాన్నా! స్కూలు కెళ్ళాడు"

"మరేం లేదు. వేరుశెనగకాయలు చుట్టుకోడానికి పేపర్లు కావాలన్నాడు, ఇది ఇద్దామని" అని శంకరం రాసుకొచ్చిన పేపర్లు చూపించాడు.

శంకరం ఖంగుతిని "సార్, మీరు చదవకుండానే జడ్జ్..."

"చదవకుండానే చెప్పగలను నువ్వు రాసింది చెత్తని, ఆ మాటకొస్తే నేను హెమింగ్వేని కూడా చదవలేదు. కాని అనుభవమా, మజాకానా?"

శంకరం కళ్లనీళ్ల పర్యంతమై వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత ఆ వ్యాసం 'ఇండియన్ లిటరేచర్' పత్రికలో అచ్చయ్యింది విశ్వామిత్ర పేరుతో. అది వేరే సంగతి.

*** *** ***

ఒక నెల రోజులు మామూలుగానే గడిచాయి.

ఓ రోజు విశ్వామిత్ర మంచి మూడ్‌లో వుండగా చూసి "సార్ నా రీసెర్చ్" అంటూ కదిపాడు శంకరం

"ఆ! అదే చెప్పాలనుకుంటున్నా, నీకో మంచి టాపిక్ సెలక్ట్ చేశానోయ్ శంకరం" అన్నాడు విశ్వామిత్ర

శంకరం ఆనంద బాష్పాలు జలజలరాల్చాడు

"ఇండియన్ రూరల్ ఫిక్షన్ అంటే నీ కిష్టమేనా?"

"ఇష్టమేసార్" ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా ఏదో ఓ టాపిక్‌పై బండిలాగిస్తే సరి అనే నిర్ణయానికి ఇదివరకే వచ్చేసాడు శంకరం

"రూరల్ ఫిక్షన్‌లో పుల్లారావు రాసిన నవలలపై రీసెర్చ్ చెయ్"

శంకరానికి మిడిగుడ్లుపడ్డాయి. పుల్లారావు అనే రచయిత పేరు అతను ఇదివరలో వినలేదు.

"పుల్లారావ్ ఎవరు సార్!" అడిగాడు ఆశ్చర్యంగా

దాంతో విశ్వామిత్ర ఒంటెత్తుమీద లేచి "ఇలా తగలడ్డాయి మన చదువులు పుల్లారావు ఎవరు అని అడగడానికి సిగ్గెయ్యడం లేదూ. పుల్లారావు మహానుభావుడు నా బాల్యస్నేహితుడు. కల్చర్ ఈజ్ నథింగ్ బట్ అగ్రికల్చర్ అనే నవల్లో ఆవులు ఎలా పేడవేస్తాయనే విషయాన్ని వాడెంత అద్భుతంగా వర్ణించాడని!

చిన్నప్పుడు ఓ రోజు మా ఇద్దరి మధ్య గోలీల తగాదా వచ్చింది. వాడు తొడచరిచాడు. నేను జబ్బ కొట్టాను. ఇద్దరం గీత గీసుకున్నాము. గీత దాటితే నిన్ను పెద్దల్లో కలిపేస్తా అన్నాడు వాడు... గీత దాటకుండానే అన్నాను నేను. అప్పుడేమయిందంటే"

విశ్వామిత్రని బాల్య ప్రవాహంలోనే వదిలిపెట్టి శంకరం లైబ్రరీకి పరిగెత్తాడు. క్యాటలాగులన్నీ వెతికాడు. ఎక్కడా పుల్లారావు పేరే కనిపించలేదు.

బుక్‌స్టాల్స్ అన్నింటిలోనూ విచారించాడు

పాత పుస్తకాలమ్మే ఫుట్‌పాత్‌లను భూతద్దమేసి మరీ గాలించాడు. ఇంగ్లీషు పుస్తకాలు చదివే అలవాటున్న వారందరిని ప్రాధేయపడి అడిగాడు.

తమ జీవిత కాలంలో సదరు పుల్లారావనే రచయిత పేరు ఎన్నడూ వినలేదని వారు ఘంటాపథంగా తేల్చి చెప్పారు.

దిక్కుతోచక విశ్వామిత్ర వద్దకొచ్చి విషయం చెప్పాడు శంకరం

విశ్వామిత్ర కాసేపు ఆలోచించి, పెళ్ళాన్ని పిలిచి "ఏమే అటకమీద మన పుల్లారావు గాడి నవలలేమైనా వున్నాయా?" అని అడిగాడు.

"వాటిని మీ థీసిస్‌తో కలిపి, ఎన్నడో చిత్తు కాగితాల కింద అమ్మేశాను" అందావిడ.

"మరి ఇప్పుడు నేనేం చేయాలి?" అడిగాడు శంకరం ఏడుపు మొహంతో

"తిరుపతి కెళ్లాలి"

"ఎందుకు, గుండు కొట్టించుకోడానికా"

"కాదు, అక్కడ యూనివర్శిటీలో గరళకంఠుడు వున్నాడు. వాడిని కలుసుకుంటే నవరిస్తాడు."

ఆయన శంకరాన్ని ఎగాదిగా చూసి "జీవితం మీద విరక్తి పుట్టిందా?" అని అడిగాడు.

"ఇప్పటి వరకూ లేదు. ఇక మీదట చెప్పలేం"

"అసలు పుల్లారావు కథాకమామీషు తెలుసా




నీకు"

"కథా కమామీషు అక్కరలేదు నవలలు చాలు"

"పుల్లారావు, విశ్వామిత్ర, నేను బాల్య స్నేహితులం. పుల్లారావుకి ఓనమాలు రావు. ఓ రోజు వాడిని కుక్క కరచింది. దొరలకుక్క. దాంతో వాడికి ఇంగ్లీష్ నేర్చుకోవాలనే పిచ్చిపట్టింది. 'లెర్న్ ఇంగ్లీషు ఇన్ థర్టీ మినిట్స్' పుస్తకం చదివి. తమ దొడ్లోని ఆవులు, కుక్కలు, ఎడ్డుల మీద వాడు మూడు నవలలు రాసిపడేశాడు. అయితే వాడి నవలలు ఎలా పబ్లిష్ అయ్యాయంటావ్? అంతా ఉక్కు పిండం మహిమ..."

"ఉక్కు పిండమెవరు?"

"ఆయనో దుక్కలాంటి పబ్లిషర్. మానవమాత్రుడి కెవడికీ అర్థంకాని బ్రహ్మపదార్థం లాంటి నవలలను మటుకే ఆయన అచ్చేసేవాడు. పుల్లారావుకీ విషయం తెలిసి ఆయన్ని కలిసి నవరిచ్చాడు. వాటిని చదివి ఉక్కుపిండం మూడురోజులు మంచం పట్టాడు. నాలుగోరోజు ఆనందంతో లేచి కూర్చొని వాటిని దభీదభీమని అచ్చేసాడు. ఆ తర్వాత నెల తిరగకుండానే దివాళా తీసి, ప్రస్తుతం గోవిందరాజుల స్వామి గుడివద్ద 'ఫుల్‌టైం బెగ్గర్'గా పనిచేస్తున్నాడు. ఓసారి నాకు, విశ్వామిత్రకు, పుల్లారావులకు మధ్య గోలీల తగాదా వచ్చింది..."

కెవ్వుమని కేకేసి అక్కడ నుంచి బయటపడ్డాడు శంకరం.

బయటకొచ్చిన శంకరానికి గట్టిగా నవ్వాలనిపించింది. నవ్వాడు. విజిల్ వేయాలనిపించింది వేశాడు. తలకిందులుగా చేతులపై నడవాలని పించింది. వెంటనే అమలుపరిచాడు.

యూనివర్శిటీల్లో తలకిందులు వ్యవహారాలు మామూలే కాబట్టి. ఎవరూ అతన్ని అభ్యంతరపెట్టలేదు.

ఓ పెద్దమనిషి మటుకు జాలి తలిచి శంకరాన్ని 'స్ట్రెయిట్'గా నిలబెట్టి, వూరు పేరు కనుక్కొని శంకరం జేబులోని డబ్బుతో టికెట్టుకొని రైలెక్కించాడు.

*** *** ***

"ఆ తర్వాత" ప్రశ్నించింది గాడిద

"తర్వాత..."

"తప్పకో తప్పకో ఎవరో సాధువులు వస్తున్నారు" మొగుణ్ని హెచ్చరించింది.

సాధువుగారు వచ్చారు. గడ్డాన్ని సవరించుకున్నారు. మీసాన్ని తాడులాగా పేనడానికి ప్రయత్నించారు.

ఉన్నట్టుండి "జై గైడు, గురునాథా" అని గావు కేకవేశారు.

ఆకాశం వైపుకి చూసి "ఆర్.ఎస్.ల ఆత్మలకి శాంతి" అని ఉచ్చాటన చేశారు.

నాలుగు దిక్కులకు తిరిగి యూనివర్శిటీని బండబూతులతో అభినందించి వెళ్ళిపోయారు.

"శంకరం ఏమయ్యాడో చెప్పనే లేదే" ప్రశ్నించింది ఆడ గాడిద.

"వేరే చెప్పడమెందుకు, చూశావుగా కళ్లతో" అంటూ సాధువు వైపు చూపించింది మగ గాడిద

ఆడ గాడిద నిర్ఘాంతపోయి, స్టీం ఇంజన్‌లా నిట్టూర్చి యూనివర్శిటీ దద్దరిల్లేలా ఓండ్రపెడుతూ నిరసన వ్యక్తం చేసింది.

